సాక్షి వరంగల్

బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



మార్కెట్ కార్యదర్శుల సస్పెన్షన్

సీసీఐ కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడిన పలు జిల్లాల మార్కెట్ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. - 8లో▸



పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్‌లు

పీఏసీఎస్ పాలకవర్గాన్ని మరో ఆరు నెలల వరకు పర్సన్ ఇన్‌చార్జ్‌గా పొడిగించే అవకాశం ఉంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35^0 / 19^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాధారణ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మొక్కజొన్న చేనులో కొండచిలువ



చెన్నారావుపేట: తిమ్మరాయినిపహాడ్ గ్రామ శివారులోని మొక్కజొన్న చేనులో కొండచిలువ మంగళవారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు సందీప్ మొక్కజొన్నకు పిండి వేయడానికి వెళ్లాడు. చేనులో కొండచిలువ కనిపించడంతో భయంతో కేకలు వేసి గ్రామస్తులకు సమాచారం అందించాడు. యువకుల సాయంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. స్పందించిన అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ సరిత సిబ్బందితో కలిసి కొండచిలువను సమీప పాకాల అడవిలో వదిశారు.

ఒక నామినేషన్ తిరస్కరణ

- సంతకం పెట్టకుండా సమర్పించడంతో తిరస్కరించిన ఎన్నికల అధికారులు

నల్లగొండ: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సమర్పించిన నామినేషన్లలో ఒక నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా.. మొత్తం 23 మంది నామినేషన్లు సమర్పించారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమం (స్క్రూటినీ) నిర్వహించారు. స్వతంత్ర అభ్యర్థి తండు ఉపేందర్ నామినేషన్ పత్రంపై సంతకం పెట్టకుండా సమర్పించడంతో తిరస్కరించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మిగిలిన 22 మంది నామినేషన్లు నిబంధనలకు అనుగుణంగా ఉండటంతో వాటిని ఆమోదించినట్లు పేర్కొన్నారు.


'నక్షా'కు వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎంపిక



వర్ధన్నపేట: నేషనల్ జియోస్పాటిస్టికల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్షా) పైలట్ ప్రాజెక్టుకు వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎంపికైంది. రాష్ట్రాల్లోని చిన్న పట్టణాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం నక్షా పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 100 మున్సిపాలిటీలను ఎంపిక చేసింది. తెలంగాణ నుంచి 10 మున్సిపాలిటీలు ఎంపిక కాగా అందులో వర్ధన్నపేట మున్సిపాలిటీ ఒకటి. నక్షా కార్యక్రమంలో ముందుగా హెలికాప్టర్ ద్వారా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 41.43 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న నివాస గృహాలు, చెరువులు, కుంటలు, కోళ్ల ఫారాలు, పెట్రోల్ బంకులు, రైస్‌మిల్లులు, ఇతర సముదాయాలను డిజిటల్ సర్వే ద్వారా కంప్యూటరీకరణ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సుధీర్‌కుమార్ తెలిపారు.

దయాకర్‌రావు అవినీతిని బయటపెడతా

టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్‌రెడ్డి



రాయపర్తి: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆస్తులు వెయ్యి రెట్లు పెరిగాయని, త్వరలో ఆయన అవినీతిని బయటపెడతానని టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ తొర్రూరు అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డితో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో డబ్బులు దండుకున్న నీచచరిత్ర దయాకర్‌రావుదని ఆరోపించారు. పాలకుర్తి ప్రజలు అహంకారానికి కాకుండా అభివృద్ధిని కోరుకొని యశస్వినిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించారని గుర్తుచేశారు. సుదీర్ఘ రాజకీయ చరిత్రలో దయాకర్‌రావు అనుచరులెవరూ బాగుపడలేదని, అతడిని వీడినవారందరూ మంచిస్థాయిలో ఉన్నారని పేర్కొన్నారు. తాను పదవుల కోసం కాంగ్రెస్‌లోకి రాలేదని, కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి ఏ పదవి అప్పగించినా బాధ్యతతో పార్టీ అభివృద్ధికి పాటుపడతానన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, సోమనాథ ఆలయ చైర్మన్ టీఎం కృష్ణమాచార్యులు, పెండ్లి మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు కల్యాణ్, నాయకులు భూక్యా సమ్మయ్య, వల్లపు కుమార్, మచ్చ రమేశ్, అనుబంధ సంఘాల నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

వన జాతరకు వెళ్లొద్దాం..

నేటినుంచి మినీ మేడారం (మండమెలిగె)

ముస్తాబైన మేడారం ● ఆదివాసీ సంస్కృతీసంప్రదాయబద్ధంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు






మేడారంలోని సమ్మక్క గుడి, కన్నెపల్లిలోని సారలమ్మ గుడి

ఎస్ఎస్ తాడ్వాయి :

ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క–సారలమ్మ మినీ జాతర (మండమెలిగె) పండుగ నేటి (బుధవారం) నుంచి ప్రారంభంకానుంది. నాలుగు రోజులపాటు జరిగే ఈ జాతరకు వివిధ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మేడారం, కన్నెపల్లిలోని ఆలయాలు, గద్దెల ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. జాతరకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలిరానున్నారు. జాతర మొదటి రోజు (బుధవారం) మేడారం, కన్నెపల్లిలోని అమ్మవార్ల ఆలయాల్లో మండమెలిగె పండుగను సమ్మక్క–సారలమ్మ పూజారులు నిర్వహించనున్నారు. ముందుగా సమ్మక్క గుడి శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆడపడుచులు రంగవల్లులు వేసి ముస్తాబు చేస్తారు. డోలు వాయిద్యాలతో తూర్పు, పడమర పొలిమేర్లలో ధ్వజస్తంభాలు (దిష్టి తగలకుండా) మామిడి తోరణాలతో అలంకరిస్తారు. ముందుగా పూజారులు గ్రామ దేవతలకు పసుపు, కుంకుమ పెట్టి పూజలు చేస్తారు. అనంతరం గుడికి చేరుకొని అమ్మవారి దీప, ధూపాలతో పూజలు నిర్వహించి యాటతో నైవేద్యం సమర్పిస్తారు. రాత్రి సమయంలో పూజారులు అమ్మవారి పూజాసామగ్రి, పసుపు, కుంకుమలను తీసుకొని డోలు వాయిద్యాలతో గద్దెల వద్దకు వెళ్లి అమ్మవారి గద్దె వద్ద కూడా పూజలు చేస్తారు. అలాగే, కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో కూడా సారలమ్మ పూజారులు అమ్మవారికి పూజలు నిర్వహించి రాత్రి సమయంలో గద్దెల ప్రాంగణంలోకి తీసుకొచ్చి పూజలు నిర్వహిస్తారు. సమ్మక్క–సారలమ్మ పూజారులు గద్దెల వద్ద కలుసుకొని శాకాహారం (ఇప్పపువ్వు సారా) ఇచ్చి పుచ్చుకొని రాత్రంతా గద్దెల వద్ద డోలు వాయిద్యాలతో జాగారం చేస్తూ సంబురాలు జరుపుకుంటారు.



'మండమెలిగె'కు పూజారులు సిద్ధం..

మేడారం, కన్నెపల్లిలో మండమెలిగె పండుగకు పూజారులు సిద్ధమయ్యారు. మంగళవారం సమ్మక్క, సారలమ్మ పూజారులు సమావేశమై మండమెలిగె పూజా కార్యక్రమాలపై చర్చించుకున్నారు. బుధవారం, గురువారం రెండు రోజులు జరగనున్న పూజా కార్యక్రమాలపై సమావేశంలో సమీక్షించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూజలు నిర్వహించాలని నిర్ణయించారు. దేవాదాయ శాఖ తరఫున పూజారులకు దుస్తులు, పూజా సామగ్రిని అధికారులు అందించారు. మండమెలిగె పండుగ సందర్భంగా మేడారం, కన్నెపల్లిలోని ఆదివాసీలు, ఆదివాసేతరులు తమ ఇళ్లను శుద్ధి చేసుకొని అమ్మవార్లకు పూజలు నిర్వహించనున్నారు.



జల్లు స్నానాలకు తిప్పలే..?

మినీజాతరకు సుమారు 10 లక్షలమందికిపైగా భక్తులు హాజరవుతారని అంచనా. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో రూ.8 లక్షలతో జంపన్నవాగులోని రెండు ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో పూడికతీసి స్నానఘట్టాలకు ఇరువైపులా 20 షవర్లను ఏర్పాటు చేశారు. జంపన్నవాగులో చుక్క నీరు లేదు. బోరు మోటార్లతో సాగు నీరు అందిస్తున్న నేపథ్యంలో ఇన్‌ఫిల్టరేషన్ ద్వారా షవర్లతో భక్తులకు సమృద్ధిగా నీరు అందే అవకాశం లేదని అధికారులు భావించారు. రెడ్డిగూడెం లోయర్ కాజ్‌వే వద్ద కొంతమేర నిల్వ ఉన్న నీటిని వాగులోనుంచి కాల్వ తీసి ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లోకి మళ్లించి షవర్ల ద్వారా నీటిని అందించాలనుకున్నారు. కానీ, జంపన్నవాగు పొడవునా వ్యవసాయ మోటార్లు నడుస్తుండటంతో ఎక్కడికక్కడే నీరు ఇంకిపోతోంది. దీంతో భక్తులకు షవర్ల ద్వారా జల్లు స్నానాలు జాతర నాలుగు రోజులు అందుతాయా లేదా అన్నది అనుమానమే. ఇరిగేషన్‌ శాఖ అధికారులు మాత్రం ఎలాగైనా భక్తులకు జల్లు స్నానాలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారం ఇరిగేషన్ ఈఈ నారాయణ, డీఈ సదయ్య, ఏఈలు, సిబ్బంది రెడ్డిగూడెం లోలెవల్ కాజ్‌వే వద్ద నిల్వ ఉన్న నీటిని కాల్వ ద్వారా మళ్లించేందుకు కొంతమేర ప్రయత్నాలు చేశారు. జాతర ప్రారంభమై భక్తుల స్నానాలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ఉంటే తమ ప్రయత్నాలు ఫలించినట్లేనని అధికారులు భావిస్తున్నారు.



రెడ్డిగూడెం లోలెవల్ కాజ్‌వే వద్ద నీటి మళ్లింపు కోసం కాల్వ తీసేందుకు ప్రయత్నిస్తున్న ఇరిగేషన్ సిబ్బంది



విద్యుత్ దీపాలతో అమ్మవారి గద్దెల ప్రాంగణం

ముస్తాబైన గద్దెల ప్రాంగణం..

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సమ్మక్క–సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని శుభ్రం చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల క్యూలైన్లపై చలువ పందిళ్లు వేశారు. మంచినీటి సౌకర్యం కల్పించారు. హైమాస్ట్ లైట్ల ఏర్పాటుతో పాటు అమ్మవార్ల గద్దెలు జిగేల్‌మనేలా సాలాహారం చుట్టూ విద్యుత్ దీపాలను అలంకరించారు. మధ్యాహ్నం సమయంలో ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రాంగణ ఆవరణలో కాళ్లు కాలకుండా కూల్ పెయింట్ వేశారు.

ప్రశాంతంగా అమ్మవార్ల దర్శనం

ములుగు కలెక్టర్ దివాకర టీఎస్



ములుగు: నేటినుంచి 15వ తేదీ వరకు జరగనున్న మినీ మేడారం జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశామని ములుగు కలెక్టర్ దివాకర టీఎస్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించేందుకు నల్లాలు, మహిళా భక్తులు దుస్తులు మార్చుకునే గదులను సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. ఇప్పటికే పారిశుద్ధ్య పనులు చేపట్టారని, వైద్యశాఖ తరఫున శిబిరాలు ఏర్పాటుచేసినట్లు వివరించారు. అమ్మవారి గద్దెల ప్రాంగణంలో, క్యూలైన్ వద్ద ప్రత్యేక పోలీసు సిబ్బందిని నియమించామని తెలిపారు. ఏటూరునాగారం మండలం కొండాయి, ఐలాపూర్ మినీ మేడారం జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ తరఫున చిన్నబోయినపల్లి నుంచి కొండాయి వరకు, ఊరట్టం నుంచి కొండాయి వరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవార్లను దర్శించుకొని ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

అధికార యంత్రాంగం సమాయత్తం..

నేటి (బుధవారం) నుంచి మినీ జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం జాతర విధుల నిర్వహణకు సిద్ధమైంది. ఇప్పటికే ఆయా శాఖల వారీగా అధికారులు, సిబ్బంది మేడారం చేరుకున్నారు. జాతరలో ఎలాంటి చెత్తాచెదారం నిల్వ ఉండకుండా, దుర్వాసన వెదజల్లకుండా జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే జోన్లు, సెక్టార్ల వారీగా విధుల్లో నిమగ్నమయ్యారు. ఎక్కడా ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా పోలీస్‌శాఖ తరఫున చర్యలు తీసుకుంటున్నారు. భక్తుల తాకిడిని బట్టి అదనపు సిబ్బందిని విధుల్లోకి తీసుకునేలా ప్రణాళిక రూపొందించారు. నాలుగు రోజుల పాటు జరిగే జాతరకు సుమారు 10 లక్షల మందికిపైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు.

వెయ్యి మందితో పటిష్ట భద్రత – నాలుగు జోన్లలో అధికారులు, సిబ్బంది

రామప్పలో ఏర్పాట్లు – దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు

జాతరకు ప్రత్యేక బస్సులు – 12, 13, 14 తేదీల్లో నడుపుతాం : ఆర్ఎం

8 లో▸

ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి రైతులు సహకరించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- కలెక్టరేట్‌లో రైతులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్: మమునూరులో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి రైతులు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో ఎయిర్‌పోర్ట్ భూసేకరణకు గుంటూరుపల్లి, బొల్లికుంట గ్రామాల రైతులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిర్‌పోర్ట్ రావడం ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన నగరాల్లో వరంగల్ కూడా ఒకటని, ఇందుకు రైతులు సహకరించాలని కోరారు. రైతులు కోరిన విధంగా రోడ్డు కనెక్టివిటీకి ప్రతిపాదనలు తయారుచేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, ఖిలా వరంగల్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

గీసుకొండ: అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. గీసుకొండ ఎంపీడీఓ కార్యాలయంలో గీసుకొండ, సంగెం, చెన్నారావుపేట మండలాల రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నామినేషన్ల స్వీకరణ నుంచి కౌంటింగ్, ఉపసర్పంచ్ ఎన్నికల వరకు రిటర్నింగ్ అధికారి పూర్తిబాధ్యత తీసుకోవాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల శిక్షణ అధికారులుగా పట్టాభి, పరమేశ్వర్ వ్యవహరించారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్, ఎంపీడీఓలు వి.కృష్ణవేణి, రవీందర్, శ్రీవాణి, ఎంపీఓ అడెపు ప్రభాకర్, డీటీ రవీందర్, కార్యాలయ సూపరింటెండెంట్ కమలాకర్, ఎంఈఓ యాప సాంబయ్య, ఎస్ఏ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

సెలవులు తీసుకోకుండా పనిచేయాలి..

దుగ్గొండి: గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎలాంటి తప్పులు జరగకుండా సమర్థవంతంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ రాంరెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో దుగ్గొండి, నల్లబెల్లి మండలాల రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు మంగళవారం శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముగిసేవరకు ఎన్నికల అధికారులు, ఉద్యోగులు సెలవులు తీసుకోకుండా పనిచేయాలని సూచించారు. దుగ్గొండి, నల్లబెల్లి ఎంపీడీఓలు లెక్కల అరుంధతి, నర్సింహమూర్తి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, మాస్టర్ ట్రైనర్లు కనకయ్య, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతితో మరిన్ని బాధ్యతలు : సీపీ

వరంగల్ క్రైం: పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని, పోలీసు అధికారులు సమర్థవంతంగా పని చేయాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులకు సూచించారు. కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తూ ఎస్సైలుగా పదోన్నతి పొందిన సంపత్, యాదగిరి, విజయ్‌కుమార్ మంగళవారం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

బియ్యం పాసింగ్‌లో గోల్‌మాల్

- చలపర్తి గోడౌన్‌లో కలెక్టర్ తనిఖీలు.. అక్రమార్కుల్లో వణుకు
- నాణ్యతలేని బియ్యాన్ని వేరు చేయిస్తున్న అధికారులు

దుగ్గొండి: సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తోంది. ఇందుకోసం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్ల ద్వారా మిల్లింగ్ చేయించి తీసుకుంటోంది. బియ్యం నాణ్యతగా ఉంటేనే గోడౌన్లలో దిగుమతి చేయాల్సి ఉంది. ఈ క్రమంలో నాణ్యత లేకున్నా గోడౌన్‌లో దిగుమతి చేసుకున్నారనే విషయాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించడంతో స్వయంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద రంగంలోకి దిగారు. దుగ్గొండి మండలం చలపర్తి గ్రామంలోని మార్కెటింగ్ శాఖ గోడౌన్‌లో నాణ్యతలేని రెండు లారీల బియ్యాన్ని గుర్తించి వెనక్కి పంపారు. ముక్కిన బియ్యం, 25 శాతానికి మించి నూకలు ఉండడంతో తిరస్కరించారు. అయితే సదరు మిల్లు నుంచి ఇంకా ఎన్ని లారీల బియ్యం దిగుమతి అయ్యాయనే విషయంపై కలెక్టర్ ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులతో



వెలుగులోకి..

చలపర్తి గోడౌన్‌కు ఖానాపురం మండలానికి చెందిన ఓ రైస్‌మిల్లు నుంచి జనవరి 29న రెండు లారీల్లో నాణ్యతలేని సన్నబియ్యం వచ్చాయి. అప్పటి నుంచి లారీలు గోడౌన్‌లోనే ఉండడం, వాటిని టెక్నికల్ అసిస్టెంట్ పాసింగ్(దిగుమతి) చేయడంతో టాస్క్‌ఫోర్స్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కలెక్టర్ ఈనెల 10న తనిఖీలు చేసి రెండు లారీల్లోని బియ్యాన్ని వెనక్కి పంపించారు. సదరు మిల్లు నుంచి 13 లారీల బియ్యం గోడౌన్‌లో దిగుమతి చేశారు. ఆ బియ్యాన్ని వేరుచేసి పరీక్షించడానికి నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, వరంగల్ నుంచి డీటీని కలెక్టర్ నియమించారు. వారంతా మిల్లుకు చెందిన బస్తాలను వేరు చేయించే పనిలో నిమగ్నమయ్యారు.

నాణ్యతలేని బియ్యం సూపర్‌ఫైన్‌గా దిగుమతి..

విద్యార్థుల కోసం అందించే సన్నబియ్యాన్ని ప్రభుత్వం 25 శాతం నూకలతో దిగుమతి చేసుకుంటుంది. 10 శాతం నూకతో ఇస్తే వాటిని సూపర్‌ఫైన్ రకంగా భావించి క్వింటాలుకు రూ.500 అదనంగా చెల్లిస్తుంది. లారీకి రూ.1.50 లక్షలు అదనంగా వస్తాయి. ఇదే అవకాశాన్ని ఆసరాగా తీసుకున్న సదరు మిల్లర్ అధికారులతో కుమ్మక్కై నాణ్యతలేని బియ్యాన్ని 10 శాతం నూకతో పాసింగ్ చేయించుకుని లబ్ధి పొందినట్లు తెలిసింది. ఇందులో జిల్లా ఉన్నతాధికారి ఒకరు, పౌరసరఫరాల శాఖలోని ఓ అధికారి, పాసింగ్ చేసే టెక్నికల్ అసిస్టెంట్ పాత్ర ఉన్నట్లు సమాచారం. వేరు చేసిన బియ్యాన్ని స్వయంగా కలెక్టర్ పరిశీలిస్తేనే విషయం తెలుస్తుందని, ఇతర అధికారులను పంపితే ఫలితం ఉండదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఓవర్ లోడ్.. 32 కేసులు నమోదు



ఖిలా వరంగల్: వరంగల్–ములుగు జాతీయ రహదారిపై ఆరెపల్లి శివారు రింగ్‌రోడ్డు వద్ద ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఇసుక, ప్లాష్ వాహనాలపై హనుమకొండ, వరంగల్ రవాణాశాఖ అధికారులు కొరఢా ఝుళిపిస్తున్నారు. రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రెండో రోజు మంగళవారం రహదారులపై అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. 32 ఓవర్ లోడ్ లారీలను గుర్తించి కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎంవీఐ జయపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక పోరుకు సమాయత్తం

- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు 646 పోలింగ్ స్టేషన్లు



వరంగల్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం జిల్లాలోని 11 మండలాల్లో 3,85,163 మంది ఓటర్లకు 646 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తూ జెడ్పీ సీఈఓ రాంరెడ్డి మంగళవారం ముసాయిదాను విడుదల చేశారు. చెన్నారావుపేట మండలంలో 55, దుగ్గొండి 65, గీసుకొండ 48, ఖానాపురం 48, నర్సంపేట 36, నల్లబెల్లి 53, నెక్కొండ 81, పర్వతగిరి 69, రాయపర్తి 78, సంగెం 66, వర్ధన్నపేటలో 47 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్ల ముసాయిదాపై 13 వరకు అభ్యంతరాలు, సూచనల స్వీకరణ, అదేరోజున రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. 14న అభ్యంతరాలు, సూచనలపై నిర్ణయం తీసుకుని పరిష్కరిస్తారు. అదేరోజున జిల్లా ఎన్నికల అధికారి పోలింగ్ స్టేషన్ల ఏర్పాటును ఆమోదిస్తారు. 15న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను విడుదల చేస్తామని సీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో పత్తి ల్యాబ్ ఏర్పాటు చేయాలి

● మంత్రి తుమ్మలను కోరిన కాటన్ అసోసియేషన్



మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న కాటన్ అసోసియేషన్ నాయకులు

వరంగల్: పత్తి సాగులో దేశంలో మూడో స్థానంలో ఉన్న తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి ల్యాబ్ లేకపోవడంతో పత్తి పరిశ్రమ పలు సవాళ్లు ఎదుర్కొంటోందని, వాటిని అధిగమించడానికి రాష్ట్ర రాజధానిలో అంతర్జాతీయ ప్రమాణాలతో ల్యాబ్ నిర్మాణంతో పాటు తెలంగాణ కాటన్ రాష్ట్ర అసోసియేషన్‌కు ఎకరం ప్రభుత్వ భూమి కేటాయించాలని తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయిన 45 లక్షల బేళ్ల పత్తిలో 40 లక్షల బేళ్లను సీసీఐతో కొనుగోలు చేయించి 3–4 రోజుల వ్యవధిలోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయించినట్లు మంత్రికి వివరించారు. గతంలో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీకి కేటాయించిన 35 గుంటల స్థలానికి నామమాత్రపు లీజ్ ధర నిర్ణయించి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఈవిషయాలపై మంత్రి సానుకూలంగా స్పందించి సదరు అంశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేశ్, సంయుక్త కార్యదర్శి కట్కూరి నాగభూషణం ఉన్నారు.

మేడారం మినీ జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

● రీజినల్ మేనేజర్ డి.విజయ భాను




హన్మకొండ: మినీ మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో భక్తుల సౌకర్యార్థం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి బస్సులు బయలుదేరుతాయని, భక్తుల రద్దీని బట్టి అప్పటికప్పుడు బస్‌ను సమకూర్చనున్నట్లు తెలిపారు. భక్తులకు 24 గంటలపాటు హనుమకొండ, మేడారం బస్టాండ్‌లలో ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎక్స్‌ప్రెస్ చార్జీలు పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.110, ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సులకు పెద్దలకు రూ.210, పిల్లలకు రూ.120గా నిర్ణయించినట్లు వివరించారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆరు నెలల పాటు పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించొచ్చు..

వరంగల్ డీసీసీబీ పరిధిలో హనుమకొండ జిల్లాలో 14 పీఏసీఎస్‌లు, భూపాలపల్లిలో 6, జనగామలో 14, మహబూబాబాద్‌లో 16, ములుగులో 11, సిద్దిపేటలో 2, వరంగల్ జిల్లాలో 28 పీఏ సీఎస్‌లున్నాయి. నూతనంగా ఏర్పాటైన జిల్లాల వారీగా చూస్తే.. హనుమకొండ జిల్లాలో 16, వరంగల్‌లో 28, జనగామలో 14, మహబూబాబాద్‌లో 19, ములుగులో 12, జేఎస్ భూపాలపల్లి జిల్లాలో 10 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. గత ప్రభుత్వం పీఏసీఎస్‌ల కాలపరిమితి ముగిసినా వాటినే పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా కొనసాగించింది. సహకార చట్టం ప్రకారం ఎన్నికలు నిర్వహించలేకపోతే ఆరు నెలల పాటు పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించొచ్చు. ఈ మేరకు ప్రస్తుత పాలక వర్గానికి ముందున్న కమిటీలను ఆరు నెలలు చొప్పును నాలుగు దఫాలు పొడిగింపు ఇచ్చారు. దీంతో వారు అదనంగా రెండు సంవత్సరాల పాటు పదవుల్లో కొనసాగారు. దీంతో ఈసారి కూడా పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా పొడిగింపు ఇవ్వొచ్చనే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.



పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్‌లు



సహకార శాఖలో కనిపించని ఎన్నికల హడావిడి

- 14వ తేదీతో పూర్తి కానున్న పాలకవర్గాల కాల పరిమితి
- వరంగల్ డీసీసీబీ పరిధిలో 91 పీఏసీఎస్‌లు
- ఆరు నెలల వరకు ప్రస్తుత పాలక వర్గాన్ని పర్సన్ ఇన్‌చార్జ్‌గా పొడిగించే అవకాశం

హన్మకొండ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) కాలపరిమితి గడువు సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో పాలకవర్గంలో అయోమయం నెలకొంది. తమను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా, కమిటీలుగా కొనసాగిస్తారా? లేక కాలపరిమితి ముగియడంతో వైదొలగాల్సి వస్తోందా అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. గత పాలకవర్గాన్ని పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా కొనసాగించారు. దీంతో ఈ సారి కూడా తమకు అవకాశం కల్పిస్తూ పొడిగిస్తారనే ఆశల్లో ప్రస్తుత ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్‌లు ఉన్నారు.

అధికార పార్టీలోకి చైర్మన్లు..

బీఆర్‌ఎస్ హయాంలో సహకార సంఘాల ఎన్నికలు జరగగా చాలా వరకు ఆ పార్టీ నాయకులు, అభిమానులు చైర్మన్లుగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చాలా మంది పీఏసీఎస్ చైర్మన్లు, మెజారిటీ డీసీసీబీ చైర్మన్లు అధికార పార్టీలో చేరారు. దీంతో తామంతా అధికార పార్టీలో ఉన్న నేపథ్యంలో తమకు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా పొడిగింపు లభిస్తుందని ఆశిస్తున్నారు.

కనిపించని ఎన్నికల హడావిడి..

ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా ప్రజాపరిషత్‌లు, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాలు సమాయత్తమవుతున్నాయి. ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు ఒక్కొటిగా పూర్తి చేసుకుంటున్నాయి. అయితే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పాలకవర్గం కాల పరిమితి మరో మూడు రోజుల్లో ముగియనున్నా ఆ శాఖలో ఎన్నికల హడావిడి కనిపించడం లేదు. దీంతో ఇప్పట్లో సహకార ఎన్నికలు జరిపే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుత పాలక వర్గాలు తమకు పొడిగింపు లభించొచ్చని ఆశిస్తున్నాయి.

పీఏసీఎస్‌లకు 2020 ఫిబ్రవరి 15న ఎన్నికలు..

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 2020 ఫిబ్రవరి 15న జరిగాయి. ఈ క్రమంలో వీటి కాలపరిమితి ఈ నెల 14తో ముగియనుంది. అదే విధంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), ఓరుగల్లు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఓడీసీఎంఎస్)ల కాల పరిమితి ఈ నెల 29తో ముగియనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలుండగా వరంగల్ డీసీసీబీ పరిధిలో 91 సంఘాలున్నాయి. వరంగల్ డీసీసీబీ ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి మేరకు విస్తరించి ఉంది. అయితే జిల్లాల పునర్విభజనతో ఉమ్మడి వరంగల్ జిల్లా ఏడు జిల్లాలుగా ఏర్పాటైంది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళ్మిట్ట మండలాలు సిద్దిపేట జిల్లాలో కలిశాయి. కాగా, ఉమ్మడి కరీంనగర్, ఖమ్మం జిల్లాల నుంచి కొన్ని మండలాలు హనుమకొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలో కలిశాయి. వరంగల్ డీసీసీబీ ఉమ్మడి వరంగల్ పరిధి మేరకు కార్యకలాపాలు కొనసాగిస్తోంది. దీంతో ఉమ్మడి జిల్లాలో పీఏసీఎస్‌ల సంఖ్య 99కి చేరింది.

వెయ్యిమందితో భద్రతా ఏర్పాట్లు

● నాలుగు జోన్లలో అధికారులు, సిబ్బంది విధులు



ములుగు: మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

ములుగు: మినీ మేడారం జాతరకు పోలీసు శాఖ తరఫున వెయ్యిమందితో భద్రతాఏర్పాట్లు పూర్తి చేసినట్లు ములుగు ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరలో ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రికొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తారన్నారు. ట్రాఫిక్ కంట్రోల్‌కు డైవర్షన్ పాయింట్లు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా వాహనం కారణంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడితే క్లియర్ చేయడానికి వీలుగా జేసీబీలు, టోయింగ్ వెహికిల్స్ సిద్ధం చేశామన్నారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్‌ను దృష్టిలో ఉంచుకుని భక్తులకు క్యూలైన్, అమ్మవారి గద్దెల వద్ద సాయం అందిచేందుకు సిబ్బందికి దిశానిర్దేశం చేశామన్నారు. నేర నియంత్రణకు అమ్మవారి గద్దెలు, జంపన్నవాగు, క్యూలైన్లలో సిబ్బంది మఫ్టీలో విధులు నిర్వహిస్తారన్నారు. చోరీలు జరగకుండా, పాతనేరస్తులను గుర్తించడానికి ఇన్‌ఫార్మలను నియమించామన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ మహేశ్ గీతే బాబాసాహేబ్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సదానందం, డీసీఆర్‌బీఓ డీఎస్పీ కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో భద్రత కట్టుదిట్టం

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారంలో బుధవారం నుంచి జరిగే సమ్మక్క, సారలమ్మ మినీ జాతరలో కట్టుదిట్ట భద్రత ఏర్పాటు చేశామని ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మేడారం పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (ఏఆర్) సదానందం, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఓఎస్డీ మహేశ్‌బాబాసాహెబ్ గీతే, డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మినీ మేడారం భక్తులకు రామప్పలో ఏర్పాట్లు



రామప్పలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

వెంకటాపురం(ఎం): మినీ మేడారం జాతర సందర్భంగా రామప్ప ఆలయాన్ని సందర్శించే భక్తుల కోసం సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ తెలిపారు. మేడారం సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్న భక్తులు తిరుగుప్రయాణంలో రామప్ప రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని వెళ్తారు. దీంతో రామప్ప ఆలయంలో తాగునీరు, లైటింగ్ వసతి ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. వాహనదారులు పార్కింగ్ స్థలాల్లో తమ వాహనాలు నిలపాలని సూచించారు.

నారాయణపురంలో అధికారుల సర్వే

● ఫలించిన రైతుల ఆందోళన



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కేసముద్రం: మండలంలోని నారాయణపురంలో సోమవారం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు ఎం.లూథూ, ఎం.బుచ్చయ్యతోపాటు రెవెన్యూ అధికారులు సరిహద్దులు నిర్ణయించేందుకు మంగళవారం సర్వే ప్రారంభించారు. 2017లో భూరికార్డుల ప్రక్షాళన సమయంలో నారాయణపురం గ్రామాన్ని నెల్లికుదురు మండలం చెట్లముప్పారం రెవెన్యూ విలేజ్ నుంచి వేరు చేసి, ఆ తర్వాత కేసముద్రం మండలంలో కలి పారు. ఈ క్రమంలో ఆ గ్రామ భూములన్నీ అటవీ శాఖ భూములుగా రికార్డుల్లో నమోదైన విషయం తెలిసిందే. ఆ తర్వాత సర్వే నిర్వహించి 735 ఎకరా లకుగాను రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు అందించారు. మిగతా రైతులకు 'ధరణి' వెబ్‌సైట్‌లో రైతు పేరు, పట్టా కాలంలో అడవి అని చూపుతుండటంతో పాస్‌పుస్తకాలు రాని విషయం తెలిసిందే. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 'ధరణి'లో చూపుతున్న అడవి అనే పేరు తొలగించింది. ఈ క్రమంలో ఈనెల 3న ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం తమకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇవ్వాలంటూ పురుగుల మందు, పెట్రోల్ బాటిళ్లతో ఆ గ్రామ రైతులు మండల కేంద్రంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేశారు. ఈ ఘటనపై కలెక్టర్ ఆదేశాల మేరకు నా రాయణపురం రెవెన్యూ పరిధిలోని సరిహద్దులను నిర్ణయించేందుకు అధికారులు సర్వే ప్రారంభించారు. సుమారు పదిరోజుల పాటు సర్వే చేసి, హద్దులు నిర్ణయించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్ఐ చెరుకుబాబు, సర్వేయర్లు లక్ష్మణ్, వెంకన్న, ఉపేందర్, శివయ్య, జూనియర్ అసిస్టెంట్ భిక్షపతి, సుధాకర్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'ఎస్ఆర్' ప్రభంజనం



రాజవర్షిత్‌రెడ్డి



తేజాస్ ఉద్ధవ్‌రెడ్డి



నాగ సిద్దార్థ

విద్యారణ్యపురి: దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో వల్లాల నాగ సిద్ధార్థ ఫిజిక్స్‌లో 100 పర్సంటైల్‌తో 99.7శాతం సాధించి ఎస్ఆర్ కీర్తిని జాతీయ స్థాయిలో నిలబెట్టాడని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, సంతోశ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. తాడిపత్రి తేజాస్ ఉద్భవ్‌రెడ్డి 99.83శాతం పర్సంటైల్, మరమ్ రాజవర్షిత్‌రెడ్డి 99.81శాతం పర్సంటైల్, దిడ్డి ప్రజ్వల్‌కుమార్ 99.77శాతం పర్సంటైల్ సాధించి తమ ప్రతిభను చాటారని వారు తెలిపారు. యాద భరణి శంకర్ 99.77శాతం, చల్లా అన్సికా 99.66శాతం, మేడ కార్తీక్ 99.66శాతం, జోగు అభిరామ్ 99.60 శాతం, కడారి సంజయ్ 99.58 శాతం, చిన్ని కమలావర్ధన్ 99.58 శాతం సాధించారని వారు తెలిపారు. భవిష్యత్‌లో మరింతగా అత్యుత్తమ మార్కులు సాధించేలా తీర్చిదిద్దుతామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతి ఏడాది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని వారు పేర్కొన్నారు.



సైబర్ మోసాలు..

రెండు ఘటనల్లో రూ. 90,400 కోల్పోయిన ఇద్దరు బాధితులు

మహబూబాబాద్ రూరల్ : ఉద్యోగం కోసం ఆశగా ఎదురు చూసి ఒకరు.. రుణం ఇస్తామంటే నమ్మి మరొకరు.. ఇలా ఇద్దరు బాధితులు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయారు. రూ. 90,400 కోల్పోయారు. ఈ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. రూరల్ ఎస్సై వి.దీపిక కథనం ప్రకారం.. మహబూబాబాద్ రూరల్ పీఎస్ పరిధిలోని జమాండ్లపల్లికి చెందిన ఎండి.చాంద్‌బీ ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో వివిధ యాప్‌లు చూస్తోంది. ఎయిర్ పోర్టులో ఉద్యోగాలు ఉన్నాయని ఆమె ఫోన్‌కు గతేడాది మే నెలలో మెసేజ్ తోపాటు కాల్ వచ్చింది. నమ్మిన చాంద్ బీ ఉద్యోగం కోసం అవతల వ్యక్తులు మొదట రూ.2 వేలు చెల్లించమని చెప్పగా చెల్లించింది. మళ్లీ రూ.6,900, మరోసారి రూ.18,900 పంపించమని చెప్పగా బదిలీ చేసింది. ఆ డబ్బులు రాకపోగా తాను మోసపోయానని కన్నీరుమున్నీరైంది. కొన్ని నెలల తర్వాత తాను టీవీ సీరియల్ హీరో అని చెప్పి ఓ వ్యక్తి ఫేస్‌బుక్ ద్వారా పరిచయమయ్యాడు. నమ్మిన చాంద్ బీ తనకు సీరియల్‌లో నటించేందుకు అవకాశం కల్పించాలని కోరగా అతడు సరే అన్నాడు. అయితే తాను ఈఎంఐ చెల్లించాలని సదరు వ్యక్తి పేర్కొనగానే రూ.33 వేల నగదు అతడి ఫోన్ పేకు బదిలీ చేసింది. రెండు ఘటనల్లో నగదు రాకపోవడంతో తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గుర్తించి సైబర్ క్రైమ్ 1930 నంబర్‌కుఫిర్యాదు చేసింది. అదే విధంగా మహబూబాబాద్ రూరల్ పీఎస్‌లో కూడా ఫిర్యాదు చేసింది.

రుణం ఇస్తామని చెప్పి మోసం..

మహబూబాబాద్ మండలం జంగిలిగొండకు కొమ్మురాజుల భరత్ ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు. ఈ క్రమంలో తన సెల్ ఫోన్‌కు కొద్ది రోజుల క్రితం రుణం కావాలా అని మెసేజ్ రాగా నమ్మాడు. రూ. రెండు లక్షల రుణం ఇస్తామని చెప్పగా సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి వారు చెప్పిన మేరకు రూ.29,600 ఫోన్ పేకు బదిలీ చేశాడు. కొద్దిరోజుల వరకు ఎలాంటి సమాచారం రాకపోవడంతో మోసపోయానని గుర్తించి గత నెల 27వ తేదీన సైబర్ క్రైమ్ 1930 నంబర్ కు ఫిర్యాదు చేశాడు. మహబూబాబాద్ రూరల్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మార్కెట్ కార్యదర్శుల సస్పెన్షన్

- వరంగల్ రీజియన్‌లో వరంగల్, జనగామతోపాటు మరో ఐదుగురిపై వేటు
- సీసీఐ కొనుగోళ్లపై ఆరా.. టీఆర్‌లో తేడాలే కారణం



వరంగల్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లలో జరిగిన అవకతవకలపై వరంగల్ రీజియన్‌లోని ఏడుగురు మార్కెట్ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. (సీసీఐ) పత్తి కొనుగోళ్ల కోసం జారీ చేసిన టెంపరరీ రిజిస్ట్రేషన్(టీఆర్)లో తేడాలు గుర్తించిన అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో ఆదిలాబాద్, చెన్నూరు, పెద్దపల్లి, వరంగల్, జనగామ, భద్రాచలం, సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మార్కెట్ కార్యదర్శులు ఉన్నట్లు వరంగల్ రీజియన్ జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. వ్యవసాయ అధికారులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాల్లో, మార్కెట్ జారీ చేసిన టీఆర్‌లో తేడాలు ఉన్నట్లు గుర్తించిన ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, జనగామ మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ సస్పెన్షన్‌కు గురైనట్లు ఆయన తెలిపారు.

పెద్ద మొత్తంలో కొనుగోళ్లు..

ప్రస్తుత సీజన్‌లో దళారులు రైతుల పేరుతో పెద్ద మొత్తంలో పత్తిని తీసుకొచ్చి సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించినట్లు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. దీంతో అధికారులు రాష్ట్రంలోని మార్కెట్ కమిటీల వారీగా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. గతేడాదికంటే రెట్టింపుగా ఈఏడాది సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు జరగడంతో ఫిర్యాదులకు బలం చేకూరింది. పత్తి సాగు చేసిన సమయంలోనే ఆయా మండలాల్లోని వ్యవసాయ అధికారులతో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. పేర్లు నమోదు చేసుకోవాలని తెలియని పత్తి రైతులు సీసీఐ కేంద్రాల్లో పత్తిని అమ్ముకునేందుకు సంబంధిత ఏఓలతో ధ్రువీకరణ పత్రాలు పొంది మార్కెట్‌కు వస్తే టెంపరరీ రిజిస్ట్రేషన్(టీఆర్)లను మార్కెట్ అధికారులు జారీ చేస్తారు. ఈ టీఆర్‌ల ప్రకారం సీసీఐ పత్తిని కొనుగోలు చేస్తుంది.

వెసులుబాటే ఆసరాగా..

కాగా.. ఈ సీజన్‌లో మార్కెటింగ్ శాఖ టీఆర్‌ల జారీ అధికారం మార్కెట్ కార్యదర్శులకు అప్పగించినట్లు తెలిసింది. ఈ వెసులుబాటును ఆసరా చేసుకున్న దళారులు ఇతర జిల్లాల నుంచి పత్తిని కొనుగోలు చేసి ఇక్కడ జారీ చేసిన టీఆర్‌లలో విస్తీర్ణం నమోదు చేసి మార్కెట్ అధికారులను తప్పుదోవ పట్టించినట్లుగా తెలిసింది. ఈవిషయం సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో డాటా ఎంట్రీ చేసిన సిబ్బంది గుర్తించినప్పటికీ దళారులతో కుమ్మక్కైనందునే ఈదందా కొనసాగినట్లుగా తెలుస్తోంది. వరంగల్ మార్కెట్ పరిధిలో సుమారు 175 టీఆర్‌లు, జనగామ మార్కెట్ పరిధిలో 4 వేలకు పైగా టీఆర్‌లు జారీ అయినట్లు తెలిసింది. వరంగల్ రీజియన్ పరిధిలో సుమారు 45 వేల వరకు టీఆర్‌లు జారీ అయినట్లు అధికారులు తెలిపారు. టీఆర్‌లు పొందిన రైతులు వారి ధ్రువీకరణ పత్రాల్లో అదనంగా పంట విస్తీర్ణం రాసిన విషయాలను మార్కెట్ అధికారులు గుర్తించకుండా టీఆర్‌లు జారీ చేసినట్లు అధికారులు రెండు రోజులుగా చేసిన విచారణలో తేలినట్లు సమాచారం. ఈకారణంగా మార్కెట్ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటుపడినట్లు సమాచారం.

వ్యవసాయ మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా జి.రెడ్డి

వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా నర్సంపేట మార్కెట్ కార్యదర్శి జి.రెడ్డిని నియమించినట్లు జేడీఎం శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల సస్పెన్షన్‌కు గురి కావడంతో ఆమె స్థానంలో జి.రెడ్డికి బాధ్యతలు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ 45 చ॥గ॥ల G+2 ఫర్నిషింగ్‌తో క్లియర్ టైటిల్ గలది. మెయిన్‌రోడ్‌కు దగ్గరలో ఎయిర్‌పోర్ట్ రోడ్ శంభునిపేట్, వరంగల్. Opp: రేనాల్డ్ స్కూల్ సంప్ర॥ 9391565095 / W: +18474431516. [WA-6552]

SERVICES

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. Cont: 8341479342. [WA-7553]

వధువు కావలెను

■ క్రిస్టియన్ 40 yrs study Inter Emజాబ్ బిల్డింగ్ కాంట్రాక్టర్ వరునికి 2వ వధువు కావలెను కుల ప్రసక్తి లేదు క్రిస్టియన్ కాలనీ మార్కెట్ రోడ్ Wgl 9515031930. [SCA25001559]

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్స్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6200]

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును 9160077916 స్పాట్ క్యాష్. [SCA25001608]

■ మీ బంగారం మణపురం, ముత్తుట్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001519]

WANTED

■ Wanted PROs / agents for MBBS, B.Tech abroad admissions. Cont: 8121554649. [WA-3281]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-SCA25001637]

■ త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. Ph:8520980099, 8520874499 [SCA25001603]

■ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పని చేయుటకు టెలికాలర్స్ కావలెను. జీతం 10000 నుండి 15000 వరకు. సెల్: 9014980722 [SCA25001640]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com

ఇద్దరు ఆత్మహత్య

- వివాహేతర సంబంధమే కారణమా?
- భర్తతో కాకుండా మరొకరితో మహిళ లైంగిక సంబంధం
- గ్రామ పెద్దల పంచాయితీ.. భర్తకు రూ.3లక్షలు కట్టాలని ఒప్పందం





స్వామి, అశ్విని మృతదేహాలు

కన్నాయిగూడెం: ఓ జంట పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వివాహేతర సంబంధమే ఈ ఆత్మహత్యకు కారణమని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఈ ఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం (కొత్తూరు) గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్ కథనం ప్రకారం.. తుపాకులగూడెం గ్రామానికి చెందిన ఆలం కిరణ్, అశ్విని భార్యాభర్తలు. అశ్విని కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన స్వామి (27) అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. గమనించిన కిరణ్.. వారం రోజుల క్రితం ఇద్దరిని గ్రామస్తుల మధ్యకు పిలిపించి పంచాయితీ పెట్టాడు. తన భార్య .. స్వామితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని, ఆమె తనకు వద్దని, నష్ట పరిహారంగా రూ.3లక్షలు చెల్లించాలని చెప్పాడు. దీనికి గ్రామపెద్దలు ఓ నిర్ణయం చేసి స్వామిని ఆ డబ్బులు కట్టాలని చెప్పారు. దీంతో స్వామి, అశ్విని అంత డబ్బు కట్టలేని పరిస్థితిలో మానసిక ఒత్తిడికి గురై పురుగుల మందు తాగినట్లు స్వామి తల్లి అనసూయ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తేలనున్నట్లు వెల్లడించారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు బలవన్మరణం

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇద్దరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.

వరంగల్: ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌టీఆర్ నగర్‌కు చెందిన చల్ల నవీన్(24) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఏ.రాఘవేందర్ మంగళవారం తెలిపారు. గత రెండు నెలలుగా ఉద్యోగం మానేసి ఇంట్లో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉద్యోగం లేదని మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి చల్ల రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు.

వేధింపులు తట్టుకోలేక వెలిశాలలో వ్యక్తి..

టేకుమట్ల: కుటుంబ సభ్యుల వేధింపులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం..



రవి(ఫైల్)

చిట్యాల మండలం చింతకుంట రామయ్యపల్లికి చెందిన చింతల రవి(48)కి మండలంలోని రామకిష్టాపూర్(వి)కు చెందిన సునీతతో వివాహం జరిగింది. ఇల్లరికంగా రామకిష్టాపూర్‌లోనే నివాసం ఉంటున్నాడు. వెలిశాలలో టిఫిన్ సెంటర్‌ను నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా భార్య సునీతతో కుటుంబ కలహాలు మొదలయ్యాయి. దీంతో భార్యతోపాటు అత్తామామలు ఆనందపు భాగ్యలక్ష్మి, సమ్మయ్య, మరదలు, తోడల్లుడు ఎలగుండ పూర్ణిమ–రవి.. రవిని వేధింపులకు గురి చేయడంతో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పలుచోట్ల, తెలిసిన వారివద్ద వెతికినా రవి ఆచూకీ తెలియ లేదు. ఈ క్రమంలో మంగళవారం వెలిశాల శివారులోని ఓ వ్యవసాయ బావిలో శవమై తేలి కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.